వ్యర్థాల తొలగింపు

తూంకుంటలో డ్రైనేజీలో వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

శామీర్‌పేట, ఆగస్టు 23 : రోడ్లపై వరదనీరు చేరకుండా మున్సిపల్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్ వెంకటగోపాల్ అన్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని 14, 16వ వార్డుల్లో పేరుకుపోయిన వరదనీరు, చెత్తాచెదారంపై శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మహాలక్ష్మి కాలనీలో వరద నీటి కారణంగా ఓపెన్ ప్లాట్లు మునిగిపోవడంతో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేశారు. డ్రైనేజీల్లో వ్యర్థాలను సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రైనేజీల్లో చెత్తా చెదారం వేయవద్దని ప్రజలకు సూచించారు.

మూడుచింతలపల్లిలో నేడు రైతు సమావేశం

శామీర్‌పేట, ఆగస్టు 23 : మూడు చింతలపల్లి రైతు వేదికలో శనివారం ఉదయం 10 గంటలకు వరి, కూరగాయల సాగుపై రైతు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎఫ్‌పీవో చైర్మన్ వంగ పెంటారెడ్డి కోరారు. వరి పంట, కూరగాయ తోటలకు తెగుళ్లు, ఇతర అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సన్మానం

దుండిగల్, ఆగస్టు 23 : దుండిగల్ మున్సిపాలిటీలోని బౌరంపేట్‌కు చెందిన యువకుడు పల్పునూరి తుల సిరెడ్డి 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఐరోపాలోని 5642 మీటర్ల మౌంట్ ఎల్బ్రస్ శిఖరాన్ని అధిరోహించి జాతీయ జెండాను ఎగురవేసిన విషయం విధితమే. శుక్రవారం తులసిరెడ్డి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలువగా శాలువాతో సన్మానించి అభినందించారు.

గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేయొద్దు

● ప్రత్యేక గ్రామ సభల్లో ప్రజలు, నాయకుల డిమాండ్
● కీసరలో ధర్నా

మేడ్చల్ రూరల్, ఆగస్టు 23: మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో తమ గ్రామాలను విలీనం చేయొద్దని పలు గ్రామాల ప్రజలు గ్రామ సభల్లో అధికారులకు విన్నవించారు. మేడ్చల్ మండలం పూడూర్, రాయిలాపూర్ గ్రామాలను మేడ్చల్ మున్సిపాలిటీలో, మునీరాబాద్, గౌడవెల్లి గ్రామాలను గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీల్లో విలీనం చేయడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు కథనాలు వెలువడిన విషయం విధితమే. శుక్రవారం నాలుగు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గ్రామస్తులతో అధికారులు ప్రత్యేక సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీల్లో విలీనానికి ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. కాగా తమ గ్రామాలను యాథావిధిగా కొనసాగించాలని, మున్సిపాలిటీల్లో కలపవద్దని ప్రజలు కోరారు. కార్యక్రమాల్లో ఎంపీవో సునీత, పంచాయతీ కార్యదర్శులు మధు, స్వరూప, భాస్కర్, మైపాల్‌రెడ్డి, సిబ్బంది, వివిధ పార్టీల గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్యదర్శికి పూడూరు వాసుల వినతి

పూడూర్‌ను మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేయడానికి ప్రజలు వ్యతిరేకించారు. మున్సిపాలిటీలో విలీనం చేయకుండా చుట్టు ప్రక్కల గ్రామాలను కలిపి ప్రత్యేకంగా పూడూర్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాబుయాదవ్, నాయకులు కృష్ణ, వెంకటేశ్, శేఖర్‌రెడ్డి, శశి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కీసర మండలంలో..

కీసర : గ్రామ పంచాయతీలను యథావిధిగా కొనసాగించాలని, మున్సిపాలిటీల్లో కలుపొద్దని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు గ్రామ సభలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో సభలను నిర్వహించారు. కీసర, యాద్గార్‌పల్లి, భోగారం, అంకిరెడ్డిపల్లి తిమ్మాయిపల్లి, చీర్యాల్, గోధుమకుంట, కరీంగూడ, రాంపల్లిదాయర, నర్సంపల్లి తదితర గ్రామాల్లో ప్రత్యేక అధికారులు సమావేశాలు ఏర్పాటు చేశారు. నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విలీనాన్ని వ్యతిరేకించారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని అధికారులు పేర్కొన్నారు.

మేడ్చల్ మండలం పూడూర్‌లో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కీసర : యాద్గార్‌పల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభలో పాల్గొన్న ప్రజలు, నాయకులు

కీసరలో నిరసన ర్యాలీలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

కీసరను పంచాయతీగానే కొనసాగించాలని అఖిలపక్షం ధర్నా

కీసరను గ్రామపంచాయతీగానే కొనసాగించాలని నాయకులంతా పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. మండల కేంద్రంలో పార్టీలకతీతంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు శుక్రవారం కీసరలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రధాన చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ సీనియర్ నేత నాయకపు వెంకటేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ కీసరలో అనేకమంది పేదలు జీవిస్తున్నారని, మున్సిపాలిటీగా చేస్తే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. ధర్నాలో మాజీ వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు బెలిదే రమేశ్‌గుప్తా, జంగయ్యాయాదవ్, మాజీ ఉప సర్పంచ్ లక్ష్మణ్‌శర్మ, రవీందర్, భానుశర్మ, రమేశ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి

● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

భవానీనగర్‌లో కమ్యూనిటీహాల్ మొదటి అంతస్తు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, ఆగస్టు 23 : ఏఎస్‌రావు నగర్ డివిజన్ భవానీనగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో రూ.18లక్షలతో నిర్మించనున్న మొదటి అంతస్తు నిర్మాణ పనులకు శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల్లో సమస్యల పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్తరామారావు, బీఆర్‌ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఏఈ కీర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు

ఉప్పల్ : ఉప్పల్ గణేశ్ ఉత్సవ సమితి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన జెట్ట కిశోర్, ఇతర సభ్యులు శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని కలిశారు. ఉత్సవ సమితి చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా జెట్ట కిశోర్‌ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆకుల మహేందర్, నిరంజన్‌చారి, రాంరెడ్డి, కిరణ్, నర్సింహారెడ్డి, అలెగ్జాండర్, ఐలేశ్, శ్రీనివాస్‌చారి, జ్ఞానేశ్వర్‌గౌడ్, సురెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బీ.రాము, బోరంపేట రాము, ఆనంద్, అనిల్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో ఉప్పల్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు

సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

దమ్మాయిగూడ మున్సిపాలిటీ 3వ వార్డులో డ్రై డే-డ్రై డే ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ ప్రణీతశ్రీకాంత్‌గౌడ్, కమిషనర్ నాగమణి, సిబ్బంది

మేడ్చల్ కలెక్టరేట్, ఆగస్టు 23 : సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతశ్రీకాంత్‌గౌడ్, కమిషనర్ నాగమణి అన్నారు. డ్రై డే-డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో అధికారులతో కలిసి చైర్‌పర్సన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్ల పక్కన, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పిచ్చి మొక్కలు లేకుండా చేసి, చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హేమలత, అధికారులు ప్రభు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు శ్రద్ధగా చదవాలి

● అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
● అలియాబాద్ జడ్పీహెచ్‌ఎస్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలన

అలియాబాద్ జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

శామీర్‌పేట, ఆగస్టు 23 : విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను శ్రద్ధగా చదివి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం అలియాబాద్ జడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, వంటశాలను పరిశీలించి సిబ్బందిని వివరాలడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సన్నబియ్యంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. శుభ్రమైన, రుచికర భోజనం అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముచ్చటించిన ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి, తాసిల్దార్ యాదగిరిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

● ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు

నాచారంలోని డీఎస్‌జీ పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

హబ్సిగూడ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో అలరించిన విద్యార్థులు

ఉప్పల్, ఆగస్టు 23 : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు శుక్రవారం ముందస్తుగా నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. నాచారంలోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. పాఠశాల చైర్మన్ నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్ పాల్గొని చిన్నారుల ప్రదర్శనలు తిలకించారు. కార్యక్రమంలో కోర్ హెడ్ ఆపరేషన్స్ కిరణ్ కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమ మీనన్ పాల్గొన్నారు. హబ్సిగూడలోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో శ్రీకృష్ణుడు, రాధ, గోపికలు, బలరామ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమం అలరించింది. వెన్న తీసే కార్యక్రమంతోపాటు కృష్ణ లీలా ప్రదర్శన చేపట్టారు. పాఠశాల డైరెక్టర్ చిలుక శివకుమార్, కరస్పాండెంట్ కల్పన, పాఠశాల ఇన్‌చార్జి సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేసిన గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి

మేడ్చల్ రూరల్, ఆగస్టు 23: ప్రభుత్వం అందజేసిన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన తొమ్మిది మందికి సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 2.74 లక్షల విలువైన చెక్కులను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ లబ్ధిదారు లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలకు సీఎం సహాయ నిధి అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కమిషనర్ స్వామినాయక్, కౌన్సిలర్లు అమరం జైపాల్‌రెడ్డి, బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, శంకర్, జీత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తా..: కార్పొరేటర్

అల్వాల్ డివిజన్‌లో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి

మల్కాజిగిరి, ఆగస్టు 23: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తానని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్త చెరువు వద్ద బతుకమ్మ కొలనులో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ పరిశీలించారు. అనంతరం రాజీవ్ వీకర్ సెక్షన్ బస్తీలో పర్యటించి ముండ్ల పొదలను తొలగించాలని, చెరువులోని గుర్రపు డెక్కను తొలగించాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో యాదగిరి గౌడ్, ప్రేమ్‌కుమార్, రాజేందర్, రహమత్ ఖాన్, సయ్యద్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

మిసెస్ సౌత్ ఇండియాగా వర్షారెడ్డి



తెలంగాణకు చెందిన వర్షారెడ్డి కేరళలోని కోయంబత్తూర్‌లో నిర్వహించిన మిసెస్ సౌత్ ఇండియా -2024 విజేత గా నిలిచింది. శుక్రవారం మాదాపూర్‌లో విలేకరుల సమావేశంలో పెగాసెస్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జెబిత అజిత్ వర్షారెడ్డికి కిరీటాన్ని అందజేశారు. 2012లో ఏపీ నుంచి మిస్ సౌత్ ఇండియా పోటీలో ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపింది. పోటీల్లో దక్షిణ రాష్ట్రాల నుంచి 12 మంది పోటీదారులు ఎంపికైనట్లు తెలిపారు. పెగాసెస్ చైర్మన్ డాక్టర్ అజిత్ పాల్గొన్నారు. - కొండాపూర్

28 నుంచి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

శామీర్‌పేట, ఆగస్టు 23 : 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌జీఎఫ్ శామీర్‌పేట జోనల్ కార్యదర్శి సత్తిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శామీర్‌పేట జోనల్ స్థాయి టోర్నమెంట్, సెలక్షన్స్ సందర్భంగా శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల విద్యార్థులకు ఈనెల 28 నుంచి 30 వరకు మజీద్‌పూర్‌లోని జైన్ హెరిటేజ్ కేంబ్రిడ్జ్ స్కూల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు 28న వాలీబాల్, 29న ఖోఖో, 30న కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అండర్-14 విభాగంలో పాల్గొనే బాలబాలికలు 1 జనవరి 2011 తర్వాత జన్మించిన వారై ఉండాలని, అండర్-17 విభాగంలో 1 జనవరి 2008 తర్వాత జన్మించిన వారై 6 నుంచి 10వ తరగతి చదువుతుండాలని తెలిపారు. ఒక వయసు కేటగిరీలో ఆడిన వారు ఇంకో కేటగిరిలో ఆడకూడదని, విద్యార్థులు వారి స్కూల్ బోనఫైడ్, ఆధార్ కార్డులు తప్పనిసరిగా తీసుకోని ఈనెల 27 ఉదయం 10 గంటల లోపు జడ్పీహెచ్‌ఎస్ తూంకుంటలో సంప్రదించాలని తెలిపారు. అదేరోజు ఉదయం 11 గంటలకు డ్రా తీస్తామన్నారు. పూర్తి వివరాలకు 9490148731, 9246190425 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

బాలిక అదృశ్యం

జవహర్‌నగర్, ఆగస్టు 23: కళాశాల నుంచి ఇంటికి వచ్చిన పదిహేడేళ్ల బాలిక అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్‌వో నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... యాప్రాల్‌లో అరవిందన్ భార్యాపిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. అరవిందన్ కూతురు స్రవంతి(17) మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నది. గురువారం కళాశాలకు వెళ్లిన స్రవంతి సాయంత్రం ఇంటికి వచ్చింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తండ్రికి ఫోన్ చేయగా... వెంటనే వస్తా.. ఇంటి వద్దనే ఉండమని కూతురికి చెప్పాడు. ఈ క్రమంలో తండ్రి ఇంటికి వచ్చి చూడగా కుమార్తె కనిపించలేదు. దీంతో ఆమె కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దాంతో తండ్రి అరవిందన్ శుక్రవారం జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఎంసీఏ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంసీఏ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ (సీబీసీఎస్) కోర్సుతో పాటు దూరవిద్య ద్వారా అందించే ఎంసీఏ కోర్సు పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను వి డుదల చేసినట్లు చెప్పారు. ఫలితాల ను www.osmania.ac.inలో అం దుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

బీఎఫ్‌టీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 23: ఓయూ పరిధిలోని బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. నాలుగో సెమిస్టర్ మెయిన్, మూడో సెమిస్టర్ సప్లమెంటరీ పరీక్షలను ఈనెల 28 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

కొండాపూర్ : చిత్రకారిణి ఆశ రాధిక మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో 'స్వాన్ : మిస్టికల్ వింగ్స్ అండ్ ఎటర్నల్ టింకిల్స్' పేరిట ఏర్పాటు చేసిన సోలో పెయింటింగ్ ఎగ్జిబిషన్ శుక్రవారం ప్రారంభమైంది. ప్రముఖ కళాకారిణి ప్రొఫెసర్ కవిత డివోస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అలుగు పోస్తున్న మేడ్చల్ పెద్ద చెరువు

మేడ్చల్ పెద్ద చెరువు అలుగు వద్ద యువకుల సందడి

నిండుకుండలా దర్శనమిస్తున్న చెరువు

మేడ్చల్, ఆగస్టు 23 : మేడ్చల్ పెద్ద చెరువు అలుగుపోస్తుంది. గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద నీరు రావడంతో చెరువు నిండుకుండలా మారింది. చెరువు అలుగు నుంచి నీళ్లు పారుతున్నాయి. కాగా గత ఐదారేళ్లుగా వర్షాకాలంలో మేడ్చల్ పెద్ద చెరువు అలుగుపోస్తున్నది. వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువు చాలా ఏండ్లు నిండలేదు. ఆరేళ్ల కిందట అలుగు పారడం ప్రారంభమైనప్పటి నుంచి వరుసగా ప్రతి ఏటా చెరువు పూర్తిగా నిండి అలుగు పోస్తున్నది. ఈ సుందర దృశ్యాన్ని అస్వాదించడానికి పట్టణ ప్రజలు, యువకులు అలుగు వద్దకు చేరుకుంటున్నారు. మత్స్యకారులు అలుగు వద్ద చేపలు పట్టి విక్రయిస్తున్నారు. ఐదు నుంచి 10 కిలోల చేపలు కూడా మత్స్యకారుల వలకు చిక్కుతున్నాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ఉప్పల్, ఆగస్టు 23 : విద్యుత్ మరమ్మతుల కారణంగా హబ్సిగూడ సెక్షన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాంరెడ్డి తెలిపారు. 11 కేవీ ఐఎస్‌ఐ ఫీడర్ పరిధిలోని జేఎస్‌ఎన్‌కాలనీ, జీజీ కాలనీ, వీవీనగర్, రవీంద్రనగర్ రోడ్‌నంబర్ 6 నుంచి 27 వరకు ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గ్రీన్‌హిల్స్ ఫీడర్‌లోని గ్రీన్‌హిల్స్‌కాలనీ, బృందావన్‌కాలనీ, స్నేహనగర్‌కాలనీలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11 కేవీ హెచ్‌ఎంటీనగర్ ఫీడర్‌లోని హైకోర్టుకాలనీ, బ్యాంక్‌కాలనీ, బాపూజీనగర్, హెచ్‌ఎంటీనగర్ రోడ్డు నంబర్ 1 నుంచి 12 వరకు విద్యుత్ ఉండదన్నారు.

ఉప్పల్, నాచారంలో..

ఉప్పల్ 11 కేవీ ఫీడర్ పరిధిలోని లక్ష్మారెడ్డికాలనీ, రాఘవేంద్రకాలనీ, సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్‌లేన్, సాయినగర్‌కాలనీ, హనుమసాయి నగర్, సూర్యనగర్ ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ ఉండదని ఉప్పల్ భాగయత్ ఏఈ కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 11 కేవీ టెక్ పార్కు సబ్‌స్టేషన్ పరిధిలోని రహేజా అపార్ట్‌మెంట్స్, నాచారం రోడ్డు నంబర్ 15, 12, 13 ప్రాంతంలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకువ విద్యుత్ సరఫరా ఉండదని నాచారం ఏఈ బి.నాగరాజు తెలిపారు.

మేడ్చల్‌లోని పలు కాలనీల్లోనూ..

మేడ్చల్ : మేడ్చల్ పట్టణంలోని పలు కాలనీలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ శశిధర్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ కంట్రీక్లబ్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు వంగిపోయిన, ధ్వంసమైన స్తంభాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కారణంగా మేడ్చల్ పట్టణంలోని సాయిబాబానగర్, ఏయిర్‌ఫోర్స్, స్టేషన్ రోడ్, వీకర్ సెక్షన్ కాలనీ, ఏకలవ్యనగర్, హరిజనవాడ, టీచర్స్ కాలనీ, కంట్రీక్లబ్, ఎస్వీఆర్ కాలనీ, సరస్వతీ నగర్, సత్యనారాయణ కాలనీ, కిందబస్తీ, హ్యాపీనగర్‌లకు ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

నాగారంలో..

మేడ్చల్ కలెక్టరేట్ : విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం నాగారం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నాగారం ఏఈ కామేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ శిల్పానగర్, 11 కేవీ బాబు రెడ్డి కాలనీ, 11 కేవీ ఎస్‌వీ నగర్, 11 కేవీ గాంధీనగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 11 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో..

మల్కాజిగిరి : మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని కృపానంద కాలనీ, చంద్రగిరి కాలనీ, పీబీ కాలనీ, ఏఎస్‌ఎన్ నగర్, ఎన్‌ఎండీసీ కాలనీ, కృష్ణానగర్, మౌలాలి 11కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు కృష్ణానగర్, మంగాపురం కొంతప్రాంతం. 11 నుంచి 11.30 వరకు పూలపల్లి బాలయ్యకాలనీ, ఎన్‌బీహెచ్ కాలనీ. 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అనంతసరస్వతి నగర్ స్ట్రీట్ నంబర్ 1, 2, 3, షిర్డీ నగర్, కల్యాణ్‌నగర్, ఎన్‌ఎండీసీ కాలనీ, ఆనంద్‌బాగ్ ఈస్ట్, బ్యాంక్ కాలనీ, తాళ్లబస్తీ. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు కృష్ణానగర్ రోడ్డు నంబర్ 8, 9, 10, 11, మోడీ అపార్ట్‌మెంట్స్. మధ్యాహ్నం 2.30 నుంచి 3.30 వరకు లాల్‌వాణి నగర్, చంద్రగిరికాలనీ, వినాయక్‌నగర్. 2.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఆనంద్‌బాగ్ వెస్ట్, ఏడీఆర్ వెనుక వైపు, కృపానంద అపార్టుమెంట్స్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

అల్వాల్ సర్కిల్ పరిధిలో..

అల్వాల్ సర్కిల్ పరిధిలోని హెచ్‌ఎంటీ ఆఫీసర్స్ కాలనీ, అంబేద్కర్‌నగర్, భూపతి రావు నగర్, హనుమాన్ టెంపుల్, ఎల్‌ఐసీ కాలనీ 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు హెచ్‌ఎంటీ, పంచశీల, అంబేద్కర్‌నగర్ బస్తీ, టీచర్స్ కాలనీ, లక్ష్మినగర్, అడ్డగుట్ట. 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భూపతిరావు నగర్, శక్తి గణేశ్‌నగర్, అల్వాల్ హిల్స్, హనుమాన్ టెంపుల్, బృందావన్ హాస్పటల్, ఎంసీహెచ్ లైన్, వాటర్ వర్క్స్ కానే. మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు చంద్రపురం కాలనీ, మంగపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శామీర్‌పేట మండలంలో...

శామీర్‌పేట : మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అలియాబాద్ ఏఈ శ్రీనివాస్ గౌడ్ ప్రకటనలో పేర్కొన్నారు. కేశవరం 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ పోతారం ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి 5 గంటల వరకు పోతారం గ్రామం, వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, రైతులు గుర్తించి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం!

అల్వాల్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ భూమిలో పునాది తీసిన దృశ్యం

మల్కాజిగిరి, ఆగస్టు 23: ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్లు గుర్తించిన స్థానికులు శనివారం అల్వాల్ సర్కిల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అల్వాల్ సర్కిల్ పరిధిలో కొన్నేళ్ల కిందట ప్రభుత్వం మహిళ భవన్ కోసం స్థలాన్ని కేటాయించింది. అయితే ఆ స్థలం పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నం చేస్తున్నారని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జేఏసీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి అధికారులను కోరారు.

దోశలో బొద్దింక..

● పోలీసులకు ఫిర్యాదు



పీర్జాదిగూడ, ఆగస్టు 23: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓ హోటల్‌లో టిఫిన్ చేస్తుండగా మాడిపోయిన బొద్దింక దర్శనమిచ్చింది. వివరాల్లోకి వెళితే.. పీర్జాదిగూడ- వరంగల్ హైవేపై శ్రీ రాఘవేంద్ర హోటల్‌లో ఓ కుటుంబం దోశ ఆర్డర్ చేసింది. దోశలో మాడిపోయిన బొద్దింక రావడంతో వారు ఆందోళనకు గురై హోటల్ సిబ్బందిని నిలదీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహిస్తుండటంతో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మియాపూర్, ఆగస్టు 23 : ఆల్విన్ కాలనీ డివిజన్ శాతవాహన నగర్ రాంకీ పెరల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ శుక్రవారం పరిశీలించారు. పనులను నాణ్యతతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.